# యుగళగీతం

మృదుల. పేరుకు తగ్గట్లే వుంటుంది తన రూపం... పరమ సాత్వికంగా. పెళ్ళిచూపుల్లో నాకు బాగా నచ్చిన లక్షణం బహుశా అదే! అందుకే చూసిన వెంటనే నా అంగీకారం తెలియచేశాను.

అయితే ఆమె వ్యక్తిత్వమూ, ఆలోచనలూ అంత మృదులమయినవి కావనీ, అవి కత్తిలా బహు పదునయినవనీ పెళ్ళయిన తర్వాత తెలిసింది.

అది నాకు కొంచెం అసహనాన్నే కలిగించింది. ఆదిలోనే హంసపాదు అన్నట్లు మా దాంపత్యంలో మొదటి అపశృతి హనీమూన్‌లోనే పలికింది.

పెళ్ళయిన పదిహేను రోజులకి యిద్దరం మద్రాస్ వెళ్ళాం. హోటల్లో రూమ్ తీసుకుని, స్నానాలు అవీ చేశాక, అక్కడే వున్న మా ఫ్రెండ్ యింటికి తీసుకువెళ్తానని బయల్దేర తీశాను.

క్రొత్త వూరు. సర్వసాధారణం. దారి తప్పాం.

ఏ వీధి చూసినా యిదేననిపించడం. నేను వేగంగా అందులోకి నడుస్తుంటే.. "యిక్కడేనా!" అంటూ మృదుల ఆత్రంగా నా వెనుక రావడం.. వీధి చివరివరకూ వెళ్ళాక వుస్సురంటూ వెనుదిరగడం.

ఇలా ఒక అరగంట గడిచాక నా అంతట నేను తెలుసుకోగలనన్న నమ్మకం సడలింది.

అపుడు సహాయం కోసం ఒక పాన్ షాప్‌లోకి నడిచాను. మృదుల అంత దూరంలో ఆగిపోయింది.

నేను ఇంగ్లీష్‌లో ప్రశ్నలు వేస్తే ఆ షాప్ అతను అరవంలో జవాబు చెప్పాడు. ఫస్ట్, సెకండ్, లెఫ్ట్, రైట్ లాంటి కొన్ని పదాలు అర్థమయాయి. తలవూపి యివతలికి వచ్చాను.

అప్పటికి మృదుల మొహం నిండా చిరాకు పరుచుకుని వుంది. "ఈ ప్రక్క షాప్‌లో అడిగి వుండచ్చు కదా ఆ పాన్ షాపులోకి వెళ్ళకపోతే.." అంది

విసుగు నిండిన గొంతుతో.

నేను వెనక్కి తిరిగి తన మొహంలోకి చూశాను. బహుశా కొంచెం కోపంగానే.

అది చూసి మరింత అసహనంగా చెప్పింది మృదుల. "మీరు అతనితో మాట్లాడుతున్నంతసేపూ ఆ షాప్ దగ్గర నిలుచున్న మగపిల్లలందరూ నన్నే చూస్తున్నారు. ఆడవాళ్ళతో వచ్చినపుడు వాళ్ళ యిబ్బంది గ్రహించుకోవాలి"

ఆమె స్వరంలో ధ్వనించిన పదును నన్ను చాలా యిరిటేట్ చేసింది. "నాకు తెలుసులే" అన్నాను గట్టిగా.

ఇంకో పదినిమిషాలు తిరిగినా యిల్లు తెలియలేదు. అతను చెప్పిన అడ్రస్ నాకు సరిగా అర్ధం కాలేదని మృదులకి అర్థం అయింది.

"ఇంకెవరినయినా అడగండి" అంది నా వెనుకనుంచి. నేను వినబడనట్టే నడవసాగాను .

ఒకరి ఆదేశాన్ని పాటించడం నాకెపుడూ అలవాటు లేదు. కానీ పాటించక తప్పేలా లేదు. అడగకపోతే అడ్రస్ తెలిసేలా లేదు.

అంతలో..

కాస్త చదువుకున్నవాడిలా, పెద్దమనిషిలా కనిపిస్తున్న ఒకాయన మాకెదురు వచ్చాడు. "ఆయన్ని అడగండి" అంది మృదుల.

నాకు సంతోషం వేసింది. ఎందుకంటే యిది ఉల్లంఘించడానికి వీలున్న ఆదేశం. ఆయన్ని పట్టించుకోకుండా ముందుకి సాగాను నేను.

మరో నాలుగడుగుల తర్వాత మరొకతను కనిపించాడు, రోడ్డు ప్రక్కగా గొంతుకు కూర్చుని చుట్ట కాల్చుకుంటూ.

అతని దగ్గరికి వెళ్ళి నేను అడగదల్చుకున్నది అడిగాను, మళ్ళీ యింగ్లీషులోనే.

అతను తలెత్తి మా యిద్దరివైపూ ఒక నిమిషం పరీక్షగా చూశాడు. ఆ తర్వాత కుడివైపొకసారీ, ఎడమవైపొకసారీ చూశాడు. ఆ తర్వాత ఏదో చెప్పాడు.
ఈసారి లెఫ్ట్, రైట్ లాంటి మాటలు కూడా లేవు. అంతా అరవమే. ఓటమిని ఒప్పుకోలేక నేను మరోసారి ఇంగ్లీషులో అడిగాను. అతను మళ్ళీ ఏదో చెప్పాడు.
ధ్వనిని బట్టి అతను మొదటిసారి చెప్పిన మాటలు రెండోసారి రిపీట్ అయినట్లు గ్రహించగలిగాను. అంతే. అంతకుమించి ఏమీ అర్థం కాలేదు.
మృదుల అసహనంగా అరిచింది. "ఏంటండీ మీరు! అతనికి ఇంగ్లీష్ రాదని అర్థమవుతోంది కదా! ఇంగ్లీషో, హిందీనో వచ్చిన వాళ్ళని అడగండి"
నేను చాలా తీక్షణంగా చూశాను. అపుడు రోడ్డు మీద ఎవరూ లేరు.
అయినా సరే. ఆ చుట్ట తాగుతూన్న వ్యక్తిముందైనా సరే.. మృదుల అంత పెద్దగా మాట్లాడడం నాకు నచ్చలేదు. అతనికేమీ అర్థం కాదని తెలిసినా సరే.. "నువు నోర్మూసుకుని వచ్చేట్లయితేనే నాతో రా!" చచ్చు సలహాలివ్వకు" అన్నాను పళ్ళ బిగువున.
మృదుల మొహం ఎర్రగా అయింది.
ఒక్క క్షణం నివ్వెరపోయినట్లుగా నిలబడిపోయింది. ఆతర్వాత.. తను నోరు మూసుకుని రావలసిన అవసరం ఎందుకు లేదో, నాలాంటి కామన్‌సెన్స్ లేనివాడి వెనుక నోరుమూసుకుని నడిస్తే వచ్చే నష్టాలేమిటో ఒక అరగంట చెప్పింది.
తను యిచ్చింది చచ్చు సలహా ఎందుకు కాదో.. పనికొచ్చే సలహాని చచ్చు అనగలిగిన నా బుర్ర ఎంత చచ్చుదై వుండచ్చో మరో అరగంట వివరించింది.
వెరసి ఫ్రెండ్ యింటికి వెళ్ళేసరికి యిద్దరి మొహాల్లోనూ నవ్వు లేదు.
అలాంటి సంఘటనలు ఆ తర్వాత చాలా జరిగాయి. "నువు మాట్లాడకు. అన్నీ నేను చూసుకుంటాను" అని మృదులకి నేను చాలా సార్లు చెప్పాను.

కానీ ఆమెకి ఆ విషయంలో నామాట వినే వుద్దేశ్యం అసలేమాత్రం లేదు. నేను మాట్లాడద్దు అన్న ప్రతిసారీ ఆమె మరింత రెచ్చిపోతుంది.

"ఏం! ఎందుకు మాట్లాడద్దు! దేవుడు నాకు మాట్లాడటానికే నోరిచ్చాడు. మధ్యలో మీ కంట్రోలేంటి!" అని అరుస్తుంది.

నిజానికి మృదుల చాలా విషయాలలో సర్దుకుంటుంది. నాకన్నా ఎక్కువగా పరిస్థితులకి అడ్జస్ట్ అవుతుంది. కానీ నేను మాట్లాడద్దు అంటే మాత్రం యింతెత్తున లేస్తుంది. శివమెత్తినదాన్లా యిక ఆ రాత్రంతా మాట్లాడుతూనే వుంటుంది. ఆ ధోరణి నాకెపుడూ అంతు పట్టదు.

"నా నోరు మూయాలని చూస్తే నేను సహించను" అంటుంది.

నోరు మూయాలని చూడటం! నా వుద్దేశ్యం అదేనా! కాదని సమర్థించుకోవడం కష్టం. ఎందుకంటే నిజం నా అంతరాత్మకి తెలుసు.

నాకు అనుకూలం కాని మాటలు.. నాకు యిబ్బంది కలిగించే మాటలు మృదుల మాట్లాడటం నాకు యిష్టం వుండదు. ఆమె నాకు సలహాలివ్వడం నాకిష్టం వుండదు. ఆమె నాకు ఏ విషయాన్నైనా వివరించడం గానీ.. నాతో చర్చించడం గానీ నాకిష్టం వుండదు.

అవును. ఆమె గొంతులోనుంచి "సరేనండీ!" అన్నమాట తప్ప మరేమైనా వినబడటం నాకు యిష్టం వుండదు.

మృదుల లాంటి యువతిని, నా అంత చదువుకున్న, నా అంత తెలివైన అమ్మాయిని అలా శాసించడం తప్పని నాకు తెలుసు.

కానీ ఏం చేయడం! ఎంత సర్ది చెప్పుకున్నా నా మనసుకి తను పెద్దగా మాట్లాడటం నచ్చదు.

ఒకసారి ఒక సినీహీరో యింటర్వ్యూ వచ్చింది పేపర్లో. జనాన్ని వెర్రెత్తిస్తున్న కథానాయకుడు అతను.

అతన్ని ఆ పత్రిక వాళ్ళు అడిగారు. "ఇంతమంది అమ్మాయిల కలల

రాకుమారుడు కదా మీరు! మీకెలాంటి అమ్మాయంటే యిష్టం!" అని.

దానికి అతను చెప్పిన సమాధానం..

"నెమ్మదిగా వుండే అమ్మాయి అంటే యిష్టం. అరిచే ఆడవాళ్ళంటే నాకసహ్యం"

ఆ యింటర్వ్యూ చదివి "వాడి బొంద" అంది మృదుల.

"ఏం!" అన్నాను నేను.

"అరిచే ఆడవాళ్ళంటే అసహ్యంట. వాడు చెప్పడమూ.. దాన్నే ఎన్లైట్ చేసి వీళ్ళు వ్రాయడమూ.." చిరాగ్గా అంది.

"దాన్దేముంది! అతని యిష్టం అతను చెప్పాడు" ఆమెని రెచ్చగొట్టే ధోరణిలో అన్నాను నేను.

కానీ చిత్రంగా మృదుల నవ్వింది. "అది యిష్టం చెప్పడం ఎలా అవుతుంది!"

"ఎందుకు కాదు? పొడుగూ, పొట్టీ, లావూ, సన్నం.. యిలా ఒక్కొక్కరికి ఒక్కొక్క యిష్టం వుంటుంది. అలాగే అది అతని యిష్టం" అన్నాను.

మృదుల నాకు చాలా పరిచితమైన చూపు చూసింది. ఏదైనా చెప్పేముందు చూసే పదునైన చూపు. ఆతర్వాత మొదలు పెట్టింది. "మీరు చెప్పే పొడుగు.. పొట్టి. . తెలుపు.. నలుపు.. యిలాంటి విషయాలకే స్థిరత్వం లేదు. అవన్నీ కూడా మార్పుకు లోనయ్యేవే. అయినా పోనీ అలాంటివి చెప్పారంటే ఒక అర్థం వుంది. ఎందుకంటే వాటిల్లో కనీసం ఎనభై శాతం పుట్టుకతో వస్తాయి.

పొట్టి అమ్మాయిలు, పొడుగు అమ్మాయిలు అంటూ కొంతవరకైనా మనం డిఫరెన్షియేట్ చేయచ్చు.

కానీ అరిచే ఆడవాళ్ళు, అరవని ఆడవాళ్ళు అని రెండురకాలుగా వుంటారా ఎక్కడైనా! కొంతమంది ఎపుడూ అరుస్తూ వుంటే కొంతమంది నోరు

కుట్టేసుకుని వుంటారా!

ఎవరైనా సమయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి ఒకసారి పెద్దగా, ఒకసారి చిన్నగా మాట్లాడతారు.

ఇష్టాలూ అయిష్టాలూ వ్యక్తం చేయడానికి "మాట్లాడటం" అనేది ఒక లక్షణం కాదు. అది ఒక అవసరం.

కాబట్టి, చూసే ఆడవాళ్ళంటే యిష్టం లేదు.. వినే ఆడవాళ్ళంటే యిష్టం లేదు అని చెప్పడం ఎంత అసంబద్ధమో మాట్లాడే ఆడవాళ్ళంటే అసహ్యం అని చెప్పడం కూడా అంతే అసంబద్ధం"

ఇంత ఉపన్యాసమూ అలుపు లేకుండా చెప్తుంది మృదుల. చెప్పి, నా అభిప్రాయమేమైనా మారిందేమోనని ఆశగా చూస్తుంది.

కానీ ఆమెకు తెలీదు. ఆమె మాటలు మొదలుపెట్టిన మొదటిక్షణమే నాలో చిరాకు మొదలయిందని. నా అసహనం యింకొంచెం పెరిగిందని.

ఒక్కొక్కసారి నాకు జాలేస్తుంది కూడా. ఎందుకు మృదుల నేను వద్దన్న పని చేసి నాకు కోపం తెప్పిస్తుంది! నేను కోరినట్లుగా ఆమె నెమ్మదిగా వుంటే నేను యింకా ఎక్కువగా తనని ప్రేమిస్తాను కదా! అది ఆమెకీ ఆనందమే కదా! అనవసరంగా నాతో చర్చించి యింటిని చిరాకు చేయడమెందుకు! అనిపిస్తుంది.

అదేమాట మృదులతో అంటే.. "నాకు మీనుంచి కావలసింది ప్రేమ ఒక్కటే కాదు. గౌరవం కూడా" అంటుంది.

గౌరవానికీ, మాట్లాడటానికీ సంబంధమేమిటో నాకర్థం కాదు.

"నువు మౌనంగా వుంటేనే నాకు నువ్వంటే గౌరవం కలుగుతుంది" అని నేనంటే.. "నన్ను మౌనంగా వుండమనడమే నన్ను అగౌరవపరచడం" అని తానంటుంది.

ఇక యిలా లాభం లేదని నాకు అర్థం అయింది.

"నా వెనుక నడవద్దు" అని నేను శాసిస్తే.. నేను మళ్ళీ తలెత్తి చూసేసరికి తను నా ముందు పరుగెత్తుతూ కనిపిస్తుందని నాకు తెలిసి వచ్చింది.

అందుకే.. ఏం చెప్పినా శాసించినట్లుగా కాకుండా, లాజికల్‌గా, తనంతట తాను లొంగిపోయేట్లుగా చెప్పాలని నిర్ణయించుకున్నాను.

నా లాజిక్‌కీ, వాదనకీ తను తల వంచేలా చేయాలి.

ఎలా! అదెలా! అని నేను ఆలోచిస్తుండగా మృదుల హడావిడిగా నా దగ్గరకి వచ్చింది.

చేతిలో వున్న పట్టుచీరలు చూపించి "ఏవండీ! రేపు ఉగాది కదా! చీర కొనుక్కోనా!" అంది.

నేను ఆశ్చర్యంగా చూస్తుంటే తనే వివరించింది. "ప్రక్కింట్లో వుండే వనజా వాళ్ళకి ఎప్పుడూ ఒక అబ్బాయి తెచ్చి అమ్ముతూంటాడు. చూడండి. వీటిల్లో ఏది బాగుందో చెప్పండి. నేనొకటి తీసుకుంటాను"

నేను వాటివైపు చూశాను. నాలుగూ డిజైన్ ఒకటే. రంగులే వేరు. ఎరుపు, ఆకుపచ్చ, గులాబి.. నాలుగోది యింకేదో అర్థం కాని కలర్. అన్నీ బాగున్నట్లే అనిపించాయి.

"నీకేది నచ్చింది?" అన్నాను.

నాలుగోరంగు చూపించి "ఇది నచ్చింది. చాలా రేర్ కలర్" అంది.

నేను తల అడ్డంగా వూపాను. "ఎరుపు తీసుకో"

"ఎరుపు ఎప్పుడూ వచ్చే రంగేగా!" అంది మృదుల కొంచెం అసంతృప్తిగా.

"కానీ నీకు ఎరుపు బాగుంటుంది. తెల్లగా వుండేవాళ్ళు డార్క్ కలర్స్ కట్టుకుంటే బాగుంటాయి. ఆ లైట్ కలర్స్ నీకెందుకు!" అన్నాను.

ఒక్క క్షణం ఆలోచనగా చూసింది మృదుల. ఆతర్వాత చిన్నగా నవ్వి లేచి నిలబడింది.

ఆమె బయటకి వెళ్ళి, మిగిలిన మూడు చీరలూ యిచ్చేసి, ఎర్ర చీరతో తిరిగి వస్తుంటే నాకళ్ళు విజయగర్వంతో మెరిశాయి.
నా వ్యూహానికి రంగం సిద్ధం అయింది.
గొంతు సవరించుకుని "మృదులా!" అని పిల్చాను, చాలా మృదువుగా.
"ఇలా రా!" అన్నాను నా ప్రక్కనే కుర్చీ చూపిస్తూ.
ఆశ్చర్యంగా చూసింది మృదుల. "ఏంటి!" అంది చిరునవ్వుతో వచ్చి కూర్చుంటూ.
"మరీ.. బట్టలు సెలెక్ట్ చేసుకోవడంలో కూడా మనిషి వ్యక్తిత్వం కనిపిస్తుంది కదా!" అన్నాను.
అర్ధం కానట్లు చూసింది.
"ఏం లేదు. నీకు ఆ లైట్ కలర్ చీర నచ్చింది కదా! అందరూ వేలం వెర్రిగా కొనే ఎరుపు, ఆకుపచ్చ గాక ఒక రేర్ కలర్ సెలెక్ట్ చేసుకోవడం ప్రత్యేకమయిన వ్యక్తిత్వం కదా!" ఎంత మామూలుగా చెప్పాలనుకున్నా నా గొంతులో లీలగా వ్యంగ్యం ధ్వనించింది.
మృదుల కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. "అయితే!" అంది.
"మరి నేను చెప్పగానే నీ నిర్ణయం మార్చుకుని ఎరుపు రంగు ఎందుకు తీసుకున్నావు?" అన్నాను.
మృదుల మొహంలో పూర్తిగా అయోమయం నిండింది. " ఎందుకు తీసుకున్నాననుకుంటున్నారు!" అంది.
నేను మరోసారి గొంతు సవరించుకున్నాను. కుర్చీలో ముందుకి వంగి గంభీరంగా చెప్పాను. "ఎందుకంటే అది నీకు ఎక్కువ నప్పుతుందని నేను చెప్పాను కాబట్టి. ఆ రంగులో నువు ఎక్కువ అందంగా కనిపిస్తావని నీకు అర్ధమయింది కాబట్టి. చూశావా! చీర కట్టుకోవడం అనేది కూడా లక్షణం కాదు. అవసరమే.

ఈ అవసరాన్ని తీర్చుకోవడానికి కూడా ఎన్నో పద్ధతులుంటాయి. కానీ అవతలివారిని మెప్పించేది గానూ, మనకి నప్పేది గానూ వుండే పద్ధతిని మనం ఎంచుకుంటాం.

కాబట్టి.. నీకు ఎర్రచీర నప్పుతుంది అని నేను చెప్పినట్లే.. అందులో నువు ఎక్కువ అందంగా కనిపిస్తావు అని నేను చెప్పినట్లే.."

నా మాటలు పూర్తి కాకముందే "ఊ.. చెప్పినట్లే.." అని మృదుల రెట్టించింది.

"నీ రూపానికీ.. నీ మొహంలోని సౌమ్యతకీ.. తక్కువ మాట్లాడటం, నెమ్మదిగా మాట్లాడటం నప్పుతుంది అని నేను చెప్పచ్చు."

ఒక్క బిగువున చెప్పేసి వూపిరి తీసుకున్నాను.

"అయిపోయింది, నేను గెల్చాను." అనుకున్నాను. "తిరుగులేని వాదనతో మృదులని పడగొట్టాను" అనుకున్నాను.

నేను తెలివిగా చమత్కారంగా మాట్లాడినపుడూ.. వాదనలో గెలిచినపుడూ.. మృదుల చేసే పని ఒకటే. ఒక్కక్షణం ఆశ్చర్యంగా చూసి, ఆ తర్వాత ఫక్కున నవ్వడం. నన్ను ముద్దుల్లో ముంచెత్తడం.

ఇపుడు కూడా ఆ రెస్పాన్స్ కోసమే ఎదురు చూస్తూ ఒక నిమిషం మౌనంగా వున్న నేను ఆ తర్వాత తలెత్తాను.

నా ఊహకి భిన్నంగా కళ్ళనిండా నీళ్ళతో కూర్చుని వుంది మృదుల.

"ఏంటి!" అన్నాను నేను కంగారుగా.

రుద్ధమయిన కంఠంతో అడిగింది మృదుల. "నేను స్వేచ్ఛగా వుండకూడదు అని చెప్పడానికి యింత వాదన అవసరమయిందా మీకు!"

"అది కాదు మృదులా!..."

"చాలా కష్టపడి వాదించారు కాని అందులో బలం లేదు. ఎందుకంటే మీ వాదనలో న్యాయం లేదు"

నేను నివ్వెరపోయి చూస్తుంటే మృదుల చెప్పింది. "చీర విషయంలో నేను కన్విన్స్ అయ్యాననుకున్నారా! డార్క్ కలర్ నాకు నప్పుతుందని.. అందులో నేను అందంగా కనిపిస్తానని మీరు చెప్పగానే మురిసిపోయాననుకున్నారా!"

నేను ఏదో చెప్పబోయాను కానీ మృదుల వినిపించుకోలేదు.

"నా పసిమి రంగుకి ఈ డార్క్ కలర్ ఎంత అందాన్నిస్తుందో, ఆ లైట్ కలర్ కూడా అంతే అందాన్నిస్తుందని నాకు తెలుసు. అయినా నేను మీరు చెప్పిన కలర్ తీసుకున్నాను. ఎందుకు! మీ యిష్టాన్ని గౌరవించి. అవును. మీ యిష్టాన్ని తీర్చడం కోసం నా యిష్టాన్ని చంపుకున్నాను.

మీరు ఎన్నో సార్లు అడిగారు "అన్ని విషయాల్లో సర్దుకుంటావు. మాట్లాడటం విషయంలో ఎందుకు సర్దుకోవు?" అని. ఆ ప్రశ్నకి నేను ఎన్నిసార్లు సమాధానం చెప్పినా మీకు అర్థం కాలేదు.

ఇవాళ చివరిసారి చెప్తున్నాను. వినండి. మీకోసం నేను నా యిష్టాల్ని చంపుకోగలను. కానీ ఎవరికోసమూ నా వ్యక్తిత్వాన్ని చంపుకోలేను."

ఒక్కక్షణం ఆగి నా మొహంలోకి సూటిగా చూసింది మృదుల. ఆతర్వాత స్పష్టంగా చెప్పింది.

"ఇప్పటివరకూ యిదే అనుకున్నాను నేను. కానీ ఈరోజు అనిపిస్తోంది. మీలాంటి వారికోసం.. అనుక్షణం నన్ను అణగదొక్కడమే లక్ష్యంగా పెట్టుకున్న మీకోసం నా యిష్టాల్ని చంపుకోవడం కూడా అనవసరమేనని. ఇంకెపుడూ.. కనీసం చీర విషయంలో కూడా.. మీ యిష్టాన్ని గౌరవించను." దుఃఖం సుడులు తిరిగే గొంతుతో ఆమాట చెప్పేసి చివ్వున లేచి లోపలికెళ్ళిపోయింది మృదుల.

నా తలలో ఒక్కసారిగా సముద్రం పొంగినట్లయింది. మృదుల గొంతులోని దుఃఖం పెద్ద శబ్దంతో నా గుండెలోకి దూకినట్లయింది.

ఇపుడు ఓడిపోయిందెవరో, గెలిచిందెవరో నాకర్థం అయింది.

అన్యాయమయిన భావాలు మార్చుకోకపోతే మళ్ళీ మళ్ళీ ఓడిపోవలసింది ఎవరో కూడా తెలిసింది.

చేతిలోని పుస్తకం టీపాయ్ మీద పడేసి, నేను కూడా వేగంగా లోపలికి నడిచాను.

దొడ్లో వేపచెట్టు క్రింద కళ్ళనీళ్ళతో నిలబడివున్న మృదులని చూసి వడివడిగా అటు వెళ్ళాను. "మృదులా!" అన్నాను భుజం మీద చెయ్యి వేసి.

వేపచెట్టు కొమ్మల్లో ఎక్కడో దాక్కుని వున్న ఓ కోయిల "కూకూ" అంది.

"సారీ మృదులా!" లాలన నిండిన గొంతుతో చెప్పాను.

మృదుల మాట్లాడలేదు. కోయిల మాత్రం మరోసారి "కూకూ" అంది.

"హుష్" అన్నాను నేను విసుగ్గా.

బదులుగా మరోసారి "కూకూ" వినిపించింది.

"చూడు మృదులా! అరవద్దంటే కోయిల వినడం లేదు. "దేవుడు నాకు నోరిచ్చాడు. మధ్యలో నీ కంట్రోల్ ఏంటి!" అంటోంది."

నా ఫిర్యాదు విని మృదుల ఫక్కున నవ్వింది.

నీళ్ళు నిండిన కళ్ళతో మృదుల నా గుండెల్లో తల దాచుకుంటుంటే.. అపుడు తెలిసింది నాకు.

మరొకరి తల వంచాలని చూడటం కన్నా మనకు తలవంపులు తెచ్చే విషయం లేదనీ, అవతలి మనిషి స్వేచ్ఛని ఒప్పుకోవడం మన బానిసత్వం కాదనీ నాకు అర్థం అయింది.

భార్యని మనిషిగా ఒప్పుకోవడంలో వుండే మాధుర్యం అనుభవమయింది.

నా జీవితంలోకి ఉగాది వచ్చింది.

*****

("ఆకాశవాణి" - 1998)